


రాయలసీమ
# దరువు
APTEL/26/A7874
www.rayalaseemadaruvu.com
తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080



ప్రచురణ : అనంతపురం/శ్రీసత్యసాయి | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | బుధవారం 23 సెప్టెంబరు 2026 | సంపుటి : 01, సంచిక : 02 | పేజీలు : 04, వెల రూ.2


## తెలంగాణకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన.. పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక



- బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం
- తెలంగాణలో రెండ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- తీవ్ర వాయుగుండంగా మారనున్నట్లు అంచనా

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తాయని పేర్కొంది.

## 'వందేమాతరం పాడకపోతే...' సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు



- వందేమాతరం పాడనంత మాత్రాన క్రిమినల్ చర్యలు కుదరవన్న సుప్రీంకోర్టు
- మతపరమైన, మనస్సాక్షికి సంబంధించిన అభ్యంతరాలకు రక్షణ
- జాతీయ గీతంగా వందేమాతరం హోదాను ప్రశ్నించలేమని స్పష్టీకరణ
- గాయకుడు టీఎం కృష్ణ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు

## ఆర్థిక వృద్ధిలో భారత్ జోరు.. వచ్చే ఏడాదిపై వరల్డ్ ఎకనామిక్ ఫోరం కీలక అంచనా




- ఎఫ్‌వై27లో భారత్ జీడీపీ వృద్ధి అంచనా 6.7 శాతం
- దేశీయ డిమాండ్ వృద్ధికి ప్రధాన కారణంగా డబ్ల్యూఈఎఫ్ అంచనా
- 74 శాతం మంది ఎకనామిస్టులు బలమైన వృద్ధిని అంచనా
- ఐదు శాతానికి తగ్గిన ఆగస్టు నిరుద్యోగిత రేటు
- 4.8 శాతానికి చేరిన ఆగస్టు ద్రవ్యోల్బణం

భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి మరో సానుకూల అంచనా వెలువడింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత్ జీడీపీ వృద్ధి 6.7 శాతంగా ఉండొచ్చని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూ ఈఎఫ్) చీఫ్ ఎకనామిస్ట్స్ ఔట్‌లుక్ నివేదిక తెలిపింది. దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం వృద్ధికి ప్రధాన కారణంగా పేర్కొంది. సెప్టెంబర్ 2026 నివేదిక కోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 92 మంది చీఫ్ ఎకనామిస్టుల అభిప్రాయాలను సేకరించారు. వీరిలో 74 శాతం మంది భారత్‌లో ఆర్థిక వృద్ధి బలంగా లేదా చాలా బలంగా ఉంటుందని అంచనా వేశారు.

# ఏపీ పట్టణాలకు కొత్త కళ..
# రూ.11,359 కోట్ల భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం

- రాష్ట్రవ్యాప్తంగా రూ.11,359 కోట్ల పట్టణ అభివృద్ధి పనులకు శ్రీకారం
- హెచ్ఏఎం పద్ధతిలో తొలిసారిగా 123 మున్సిపాలిటీల్లో పనుల ప్రారంభం
- కుప్పం నుంచి లాంఛనంగా పనులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కుల నిర్మాణం లక్ష్యం
- శాంతిపురం వద్ద హంద్రీనీవా కాలువకు జలహారతి ఇవ్వనున్న ముఖ్యమంత్రి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణాల రూపురేఖలను సమూలంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ఒక బృహత్తర కార్యక్రమానికి నేడు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 106 నియోజకవర్గాల పరిధిలో ఉన్న 123 మున్సిపాలిటీల్లో ఏకకాలంలో పనులు మొదలు కానున్నాయి. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.7,469 కోట్లు, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో ప్రత్యేకంగా రూ.3,890 కోట్ల విలువైన పనులను చేపట్టనున్నారు. ఈ నిధులతో ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణానికి రూ.4,656 కోట్లు, సెంట్రల్ మీడియన్ల ఏర్పాటుకు మిగతా..2లో

## పిఠాపురంలో రూ.1,500 కోట్ల అభివృద్ధి పండుగ




: నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామన్న పవన్

- చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్న పవన్ కల్యాణ్
- కొత్తగా నిర్మించిన రథశాల, యాగశాల, కాలక్షేప మండపం, అన్నదాన హాలు పనులను పరిశీలించిన పవన్
- నాగులపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండో రోజు విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమ లు తో పాటు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దేందుకు రూ.1,500 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టు లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.


# 2026 డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో ఉంటా.. జైలుకెళ్లేందుకు సిద్ధం: షేక్ హసీనా

- ఉరిశిక్ష రాజకీయ ప్రేరేపితమని, జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని స్పష్టం
- అవామీ లీగ్ పార్టీని పునర్నిర్మించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే లక్ష్యం
- బంగ్లాలో ఉగ్రవాదం ముప్పు తీవ్రంగా ఉందన్న మాజీ ప్రధాని
- తిరిగి వచ్చే విషయంపై ప్రభుత్వాలతో చర్చలు జరపలేదని వెల్లడి



బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. 2026 డిసెంబర్ నాటికి తాను తప్పకుండా స్వదేశానికి తిరిగి వెళ్తానని ఆమె స్పష్టం చేశారు. తాను ఎప్పుడు వెళతాననే దానికంటే, ఏ విధంగా వెళతాననేదే అత్యంత ప్రధానమని ఆమె వ్యాఖ్యానించారు. ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా ఈ విషయాలను వెల్లడించారు. తన పునరాగమనం శాంతియుత మార్గంలో, చట్టబద్ధంగానే ఉండాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. 2025 నవంబర్‌లో బంగ్లాదేశ్ ట్రిబ్యునల్ తనకు మరణశిక్ష విధించడాన్ని హసీనా తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, అన్యాయమైన తీర్పు అని ఆమె ఆరోపించారు. తన నిష్క్రమణ అనంతరం కొలువుదీరిన ప్రస్తుత ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధ మైనదిగా, తనపై జరుగుతున్న విచారణను ఒక ప్రహ సనంగా ఆమె అభివర్ణించారు. తన రాజకీయ పోరాటం లో భాగంగా జైలుకు వెళ్లేందుకైనా తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ఆమె తేల్చిచెప్పారు.

## అమెరికాకు ఇరాన్ కీలక ఆఫర్.. దిగొచ్చిన చమురు ధరలు



- హర్మూజ్ జలసంధి తెరవడానికి సిద్ధమన్న ఇరాన్
- అమెరికా సైనిక ఒత్తిడి తగ్గించాలని షరతు
- పోర్టుల దిగ్బంధనం ఎత్తివేయాలని డిమాండ్
- మధ్యవర్తుల ద్వారా అమెరికాకు ప్రతిపాదన
- చమురు ధరలు 99 డాలర్ల దిగువకు పతనం

## ఆసియా క్రీడల్లో మహిళా క్రికెట్ జట్టుకు స్వర్ణం.. ప్రధాని మోదీ ట్వీట్



- ఆసియా క్రీడలు 2026లో భారత్‌కు తొలి స్వర్ణం
- మహిళల క్రికెట్ ఫైనల్లో శ్రీలంకపై 147 పరుగుల తేడాతో విజయం
- దేశం గర్విస్తోందంటూ జట్టును అభినందించిన ప్రధాని మోదీ
- చారిత్రక విజయమంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంస

ఆసియా క్రీడలు-2026లో భారత్ స్వర్ణ పతకాల ఖాతాను ఘనంగా ప్రారంభించింది. భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి, ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. ఫైనల్ పోరులో శ్రీలంకను 147 పరుగుల భారీ తేడాతో ఓడించి, వరుసగా రెండోసారి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా టోర్నీ ఆద్యంతం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ చారిత్రక విజయంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయ పూర్వక శుభా కాంక్షలు తెలియజేశారు. "భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మిగతా..2లో

## జూరాలకు నీళ్లివ్వండి.. కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్



- జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్
- నీటి విడుదలకు శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం
- బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి
- జూరాల నీటి కోసం రైతుల ఆందోళన

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎం సీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కో రారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండి పోయే పరిస్థితి ఉందని తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, అత్యాచారాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది

- ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలపై రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష
- ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం దళితులకు కేటాయిస్తున్నట్టు రేవంత్ వెల్లడి
- విద్యా వికాసమే పేదరికాన్ని నిర్మూలిస్తుందని వ్యాఖ్య



తెలంగాణ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలు, సంక్షేమ పథకాల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, తమ ప్రభుత్వం దళితులు, ఆదివాసీలు, గిరిజనుల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తోందని స్పష్టం చేశారు. పేద ప్రజలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల పట్టాలు అందించిన ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే తమ ప్రజా పాలన కొనసాగుతోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో 31 శాతం దళితులకు, 17 శాతం ఎస్టీలకు మంజూరు చేసి సంక్షేమంలో పెద్దపీట వేశా మని వెల్లడించారు. అట్టడుగు వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న పలు విప్లవాత్మక చర్యలను సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఉదయం పూట పౌష్టికాహార బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, అలాగే 3 కోట్ల 48 లక్షల మంది ప్రజలకు నాణ్యమైన

## విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదు: సీపీఐ



- విజయ్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఆలోచన లేదన్న సీపీఐ
- ప్రజా తీర్పును గౌరవించి బయటి నుంచి మద్దతు ఇస్తున్న వామపక్షాలు
- ఉప ఎన్నికల్లో టీవీకేకు వ్యతిరేకంగా సొంతంగా పోటీ
- విభేదాలు ఉన్నప్పటికీ ప్రభుత్వానికి మద్దతు కొనసాగుతుందని స్పష్టత

రాయలసీమ దరువు APTEL/26/A7874
తెలుగు దినపత్రిక



# ఏపీ పట్టణాలకు కొత్త కళ.. రూ.11,359 కోట్ల భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం

మొదటి పేజి తరువాయి

రూ.88 కోట్లు, కొత్త స్ట్రీట్ లైటింగ్ కోసం రూ.247 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.509 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమం పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల మేర స్ట్రీట్ లైటింగ్, 300 కిలోమీటర్ల సీవరేజ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తాయి. పట్టణ స్థానిక సంస్థలపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పనులను హెచ్ఏఎం పద్ధతిలో అమలు చేస్తోంది. ఈ విధానంలో కాంట్రాక్టర్లు తమ సొంత



నిధులతో పనులు పూర్తిచేయగా, ప్రభుత్వం వారికి వార్షిక వాయిదాల రూపంలో చెల్లింపులు చేస్తుంది. కుప్పంలో పనులు ప్రారంభించిన తర్వాత సీఎం చంద్రబాబు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలు, మునిసిపల్ శాఖ అధికారులతో మాట్లాడి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద హంద్రీనీవా కాలువను సందర్శించి కృష్ణా జలాలకు సీఎం జలహారతి ఇవ్వనున్నారు. అనంతరం ఈసీ పౌల్ట్రీ షెడ్ కార్యక్రమం కింద ఎంపికైన కొందరు లబ్ధిదారులతో ముచ్చటించి, మధ్యాహ్నం పార్టీ కేడర్‌తో జరిగే సమావేశంలో పాల్గొననున్నారు.

మొదటి పేజి తరువాయి

## ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, అత్యాచారాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది

సన్న బియ్యం పంపిణీ చేస్తూ పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనాన్ని చేరవేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడులు, అత్యాచార ఘటనలపై ప్రభుత్వం అత్యంత కఠినంగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. బాధితులకు అందాల్సిన నష్టపరిహార నిధు లను బడ్జెట్ అడ్డంకులు లేకుండా నేరుగా 'గ్రీన్ ఛానెల్' ద్వారా తక్షణమే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా వికాసమే పేదరి కాన్ని నిర్మూలిస్తుందని, అందుకే పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించాలని, రాజకీయాలకు అతీతంగా ఈ వర్గాల పురోగతికి భాగస్వాములు కావా లని పిలుపునిచ్చారు.

## అమెరికాకు ఇరాన్ కీలక ఆఫర్.. దిగొచ్చిన చమురు ధరలు

మొదటి పేజి తరువాయి

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధమని తెలిపింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి వెల్లడించినట్లు రాయిటర్స్ తెలిపింది. మధ్యవర్తుల ద్వారా ఈ ప్రతిపాదనను అమెరికాకు చేరవేసినట్లు సమాచారం. అమెరికాతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ఈ ప్రతిపాదనతో సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా న్యూయార్క్‌లో మధ్యవర్తి దేశాలతో ఈ అంశంపై చర్చించాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భేటీ ఉండబోదని ఇరాన్ అధికారి తెలిపారు. అయితే అమెరికా నిబద్ధత చూపితే ఒప్పందం దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు. హర్మూజ్ జలసంధికి సంబంధించిన సైనిక చర్యలను అమెరికా నిలిపివేయాలని ఇరాన్ కోరుతోంది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, ఇరాన్ పోర్టులపై ఆంక్షలు ఎత్తివేస్తే జలసంధిని తిరిగి తెరిచి చర్చలను కొనసాగిస్తామని టెహ్రాన్ చెబుతోంది. పోర్టులపై ఆంక్షలు ఇరాన్ ముడిచమురు ఎగుమతులు, సముద్ర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. చర్చలను పునరుద్ధరించేందుకు ఇరాన్ గతంలో ఏడు షరతులను కూడా వెల్లడించింది. హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకునే అవకాశం ఉందన్న వార్తలతో అంతర్జాతీయ చమురు ధరలు తగ్గాయి. బ్యారెల్ చమురు ధర 99 డాలర్ల దిగువకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర సెషన్ గరిష్ఠ స్థాయి నుంచి 3.5 శాతానికి పైగా తగ్గగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 2.25 శాతం పడిపోయింది. హర్మూజ్ ద్వారా ముడిచమురు సరఫరాలో అంతరాయాలపై ఆందోళనలు తగ్గడంతో ధరలు దిగివచ్చాయి.

## జూరాలకు నీళ్లివ్వండి.. కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్

మొదటి పేజి తరువాయి

రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు.జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదు: సీపీఐ


తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు తెలుపుతున్న వామపక్షాలు కీలక ప్రకటన చేశాయి. ప్రభుత్వ స్థిరత్వానికి ఎలాంటి విఘాతం కలిగించే ఉద్దేశం తమకు లేదని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) స్పష్టం చేసింది. ఉప ఎన్నికల్లో వేర్వేరుగా పోటీ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వానికి తమ మద్దతు కొనసాగుతుందని తేల్చిచెప్పింది. 2026 అసెంబ్లీ ఎన్నికల అనంతరం టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన స్పష్టమైన మెజారిటీని సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో ప్రజా తీర్పును గౌరవిస్తూ, రాష్ట్రపతి పాలనకు లేదా బీజేపీ పరోక్ష ప్రభావానికి తావు ఇవ్వకూడదనే ఉద్దేశంతో సీపీఐ, సీపీఎం పార్టీలు ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ప్రకటించాయి. తాము మంత్రివర్గంలో చేరబోమని, అధికార కూటమిలో భాగస్వాములుగా ఉండబోమని ఆ సమయంలోనే అవి స్పష్టం చేశాయి. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాలు, అభ్యర్థుల ఎంపిక, ఆర్థికపరమైన అంశాలపై టీవీకే, వామపక్షాల మధ్య కొన్ని విభేదాలు తలెత్తాయి. వీటికి తోడు అక్టోబర్ 6న జరగనున్న మధురాంతకం, ధారపురం నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో వామపక్షాలు సొంతంగా బరిలోకి దిగుతుండటంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ పరిణామాల నేపథ్యంలో సీపీఐ స్పందించింది. ఉప ఎన్నికల్లో స్నేహపూర్వక పోటీ ఉన్నప్పటికీ, విజయ్ ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకునే ప్రణాళిక ఏదీ లేదని, ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన అసలే లేదని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. దీంతో విజయ్ ప్రభుత్వ స్థిరత్వంపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది.ద

## 'వందేమాతరం పాడకపోతే...' సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు

వందేమాతరం గీతాన్ని ఆలపించలేదన్న కారణంతో వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మతపరమైన విశ్వాసాలు లేదా మనస్సాక్షికి సంబంధించిన కారణాలతో ఎవరైనా ఈ గీతాన్ని పాడటానికి నిరాకరిస్తే, వారిపై ఎటువంటి శిక్షార్హమైన చర్యలు ఉండబోవని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అదే సమయంలో, జాతీయ గీతంగా వందేమాతరం హోదాను న్యాయస్థానాలు సమీక్షించలేవని కూడా స్పష్టం చేసింది. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్‌ను, అలాగే జాతీయ చిహ్నాలను అవమానించకుండా నిరోధించే చట్టం-2026 సవరణను టీఎం కృష్ణ సవాల్ చేశారు. గీతంలోని చివరి నాలుగు చరణాలలో హిందూ దేవతల ప్రస్తావన ఉండటం రాజ్యాంగబద్ధమైన లౌకిక స్ఫూర్తికి, మత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ, "వందేమాతరం సుదీర్ఘ కాలంగా జాతీయ గీతంగా కొనసాగుతోంది, దాని హోదాను మేము ప్రశ్నించలేము" అని వ్యాఖ్యానించింది. అయితే, ఆర్టికల్స్ 25, 26 ప్రకారం మత విశ్వాసాలు లేదా వ్యక్తిగత విచక్షణ కారణంగా ఎవరైనా ఈ గీతాన్ని పాడటానికి అభ్యంతరం వ్యక్తం చేస్తే, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. వ్యక్తులు తమ ఇష్టానుసారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ చరణాలను పాడవచ్చని లేదా అస్సలు పాడకుండా ఉండవచ్చని కోర్టు అభిప్రాయపడింది. 1986 నాటి చరిత్రాత్మక బిజో ఇమ్మాన్యుయేల్ కేసులో, మత విశ్వాసాల కారణంగా జాతీయ గీతాన్ని పాడలేమని కోరిన జెహోవా సాక్షుల విభాగానికి చెందిన విద్యార్థులకు సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. ప్రాథమిక హక్కులను ప్రాథమిక విధులు అధిగమించలేవని ఆ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొంది. ప్రస్తుత పిటిషన్‌లో కేవలం క్రిమినల్ చర్యలకు సంబంధించిన అంశాన్ని మాత్రమే పరిశీలిస్తామని, గీతంలోని సాహిత్యంపై లేదా దాని అధికారిక హోదాపై ఎటువంటి తీర్పు ఇవ్వబోమని న్యాయస్థానం వెల్లడించింది.

## తెలంగాణకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన.. పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక

మొదటి పేజి తరువాయి



వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో అతి భారీ వర్షాలు, మరో 20 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు అధికారులు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం రానున్న 12 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

## ఆర్థిక వృద్ధిలో భారత్ జోరు.. వచ్చే ఏడాదిపై వరల్డ్ ఎకనామిక్ ఫోరం కీలక అంచనా

మొదటి పేజి తరువాయి

మే నెలలో ఈ అభిప్రాయం 52 శాతంగా ఉంది. వచ్చే 12 నెలల్లో భారత్ వృద్ధి మోస్తరుగా లేదా అంతకంటే మెరుగ్గా ఉంటుందని 98 శాతం మంది భావించారు. ఉద్యోగాల విషయానికొస్తే.. వచ్చే 12 నెలల్లో నిరుద్యోగితలో మార్పు ఉండదని 70 శాతం మంది అంచనా వేశారు. ఆగస్టులో 15 ఏళ్లు పైబడిన వారి నిరుద్యోగిత రేటు 5 శాతానికి తగ్గింది. జులైలో ఇది 5.1 శాతంగా ఉంది. ఇదే సమయంలో లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు 55.4 శాతం నుంచి 55.6 శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణంపై కూడా అంచనాలు కొంత మెరుగయ్యాయి. వచ్చే ఏడాది భారత్‌లో ద్రవ్యోల్బణం మోస్తరు స్థాయిలో ఉంటుందని 55 శాతం మంది ఎకనామిస్టులు భావించారు. 45 శాతం మంది మాత్రం అధికంగా ఉంటుందని అంచనా వేశారు. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.8 శాతానికి చేరింది. ఇది ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతానికి మించి ఉంది. అయితే 2-6 శాతం పరిమితిలోనే కొనసాగుతోంది. ద్రవ్య విధానంలో మార్పు ఉండదని 67 శాతం మంది అంచనా వేశారు. ఆగస్టులో పాలసీ రేటును 5.25 శాతం వద్దే కొనసాగించారు. ఈ నివేదిక సర్వే ఆగస్టు 20న పూర్తయింది. ఆ తర్వాత ఆగస్టు 31న విడుదలైన గణాంకాల్లో 2026-27 తొలి త్రైమాసికంలో భారత్ జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. దీంతో పలు సంస్థలు తమ వృద్ధి అంచనాలను పెంచుతున్నాయి. మూడీస్ కూడా తన అంచనాను 6 శాతం నుంచి 7 శాతానికి పెంచింది.

## 2026 డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో ఉంటా.. జైలుకెళ్లేందుకు సిద్ధం: షేక్ హసీనా

మొదటి పేజి తరువాయి

ప్రస్తుతం రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఎదుర్కొంటున్న తన 'అవామీ లీగ్' పార్టీని పునర్నిర్మించడం, పార్టీ శ్రేణులతో సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తానని హసీనా వివరించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద, తీవ్రవాద శక్తుల నుంచి ముప్పు పొంచి ఉందని, ఇది కేవలం ఆ దేశ అంతర్గత సమస్య మాత్రమే కాదని, ఒక తీవ్రమైన ప్రాంతీయ ముప్పు అని ఆమె హెచ్చరించారు. అయితే, తన పునరాగమన ప్రణాళికలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా ఖరారు కాలేదని ఆమె వెల్లడించారు. ఈ విషయంపై బంగ్లాదేశ్ లేదా భారత ప్రభుత్వాలతో తాను ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక లేదా అనధికారిక చర్చలు జరపలేదని హసీనా స్పష్టం చేశారు.

## ఆసియా క్రీడల్లో మహిళా క్రికెట్ జట్టుకు స్వర్ణం.. ప్రధాని మోదీ ట్వీట్

మొదటి పేజి తరువాయి

మన క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. వారి ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సమష్టి కృషి అమోఘం. ఈ విజయంతో దేశం గర్విస్తోంది. మీరు యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారు" అని మోదీ ప్రశంసించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన సుచికా తరియల్‌ను కూడా ప్రధానమంత్రి అభినందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం భారత జట్టును అభినందించారు. ఈ విజయం చరిత్రలో నిలిచిపోతుందని, రాబోయే తరాలకు, ముఖ్యంగా దేశంలోని యువతకు ఇది గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండు ల్కర్ స్పందిస్తూ, షఫాలీ వర్మ, స్మృతి మంధానల అద్భుత భాగస్వామ్యాన్ని, బౌలర్ల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశం సించారు. ఈ చారిత్రక విజయంతో భారత మహిళా జట్టుపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది.

## పిఠాపురంలో రూ.1,500 కోట్ల అభివృద్ధి పండుగ

మొదటి పేజి తరువాయి

పర్యటనలో భాగంగా గొల్ల ప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకుని, ఏకాదశి వ్రతాచరణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాభివృద్ధికి కేటాయించిన రూ.90 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన రథశాల, యాగశాల, కాలక్షేప మండపం, అన్నదాన హోలు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం యు. కొత్తపల్లి మండలంలో రూ.9.59 కోట్లతో పునరుద్ధరించిన నాగుల పల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించి, 52 ఆవాసాలలోని సుమారు 97 వేల మంది ప్రజ లకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. కొండేవారంలో ఇంటింటి కుళాయి కనెక్షన్లను స్వయం గా పరిశీలించారు. ఆర్ఆర్ బీహెచ్ఆర్ మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్, స్వయం సహాయక సంఘాలకు రూ.120 కోట్ల రుణాల చెక్కులు, లబ్ధిదారులకు క్రమ బద్ధీకరణ ఇళ్ల పట్టాలు, మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, పదో తరగతి ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను పం పిణీ చేశారు. పిఠాపురం పట్టణంలో శాశ్వత డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం, రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, రూ.34 కోట్లతో దేవాలయాల పునరుద్ధరణ, రూ.323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి కీలక ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులు పవన్ కల్యాణ్‌కు నాగలిని కానుకగా ఇచ్చి తమ కృతజ్ఞతలు తెలిపారు.

## తిరువూరులో సీడ్ యాక్సిస్ రోడ్ల తరహాలో అభివృద్ధికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన

తిరువూరులో మధిర ప్రధాన రహదారి ఆధునికీకరణ పనులకు శ్రీకారం

రూ. 14 కోట్ల పనులకు వర్చువల్ గా శంకుస్థాపన చేసిన చంద్రబాబు

ప్రత్యక్షంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కొలికపూడి



ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. తిరువూరు పట్టణంలోని మధిర ప్రధాన రహదారి ఆధునీకరణ, విస్తరణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' విధానంలో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. సచివాలయం నుంచి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయగా, స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు మధిర రోడ్డు వద్ద ప్రత్యక్షంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని ప్రపంచ స్థాయి ఐఎస్‌బీ రోడ్లు, రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సిస్ రోడ్ల నమూనాలో తిరువూరు మధిర రహదారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ రూ.14 కోట్ల ప్రాజెక్టు పూర్తయితే తిరువూరు పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని... ప్రయాణికులు, స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి స్వయంగా డప్పు కొట్టి, నృత్యం చేస్తూ కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఏ. కుమార్, మున్సిపల్ కమిషనర్ కె. మనోజ్, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యూయార్క్‌లో ఐరాస సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు... అమెరికా ఆంక్షల వలయం

ఐక్యరాజ్యసమితి సమావేశానికి న్యూయార్క్ వెళ్లిన ఇరాన్ అధ్యక్షుడు

పెజెష్కియాన్ కదలికలపై అమెరికా ప్రభుత్వం కఠిన ఆంక్షలు

హోటల్, ఐక్యరాజ్య సమితి కార్యాలయం మధ్య తప్ప ఎక్కడికీ వెళ్లడానికి వీల్లేదు

అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ న్యూయార్క్‌లో అడుగుపెట్టారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనపై, ఆతిథ్య దేశమైన అమెరికా కఠినమైన ప్రయాణ ఆంక్షలు విధించింది. ఆయన తన ప్రతినిధి బృందంతో కలిసి, తాము బస చేసిన మాన్‌హాటన్‌లోని మిలీనియం హిల్టన్ హోటల్ నుండి ఐరాస ప్రధాన కార్యాలయానికి మాత్రమే ప్రయాణించాలని స్పష్టం చేసింది. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం, పెజెష్కియాన్ బృందం ప్రత్యేక అనుమతి లేకుండా న్యూయార్క్‌లోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వీల్లేదు. ఇరాన్ దౌత్యవేత్తలపై ఇటు వంటి ఆంక్షలు 2024 నుండి అమలులో ఉండగా, గతంలో ట్రంప్ హయాంలో వాటిని మరింత కఠిన తరం చేశారు. దాదాపు ఏడు నెలలుగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, 1947 ఐరాస ఒప్పందం ప్రకారం సభ్య దేశాల ప్రతినిధులను అనుమతించాల్సిన బాధ్యత అమెరికాపై ఉంది. ఈ వారం జరగనున్న ఐరాస సమావేశంలో పెజెష్కియాన్ ప్రసంగించనున్నారు. తమ దేశంపై దాడులు జరిగాయని, తమ చర్యలు కేవలం ఆత్మరక్షణ కోసమేనని ఆయన వాదించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో భాగంగా అమెరికా, యూరప్ థింక్ ట్యాంక్ విశ్లేషకులతో సమావేశమయ్యేందుకు కూడా ఆయన ప్రయత్ని స్తున్నట్లు సమాచారం. మరోవైపు, డొనాల్డ్ ట్రంప్ కూడా పెజెష్కియాన్‌తో భేటీకి సిద్ధంగా ఉన్నట్లు సూచన ప్రాయంగా తెలిపినప్పటికీ, అధికారికంగా ఎలాంటి చర్చల ప్రణాళిక సిద్ధం కాలేదు. ఇరు దేశాల మధ్య అర్థవ ంతమైన చర్చలు జరగాలంటే అవి న్యూయార్క్ వెలుపల జరగడమే శ్రేయస్కరమని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటో నియో గుటెర్రస్ అభిప్రాయపడ్డారు. అణు కార్యక్రమం, హర్మూజ్ జలసంధి వివాదాల నేపథ్యంలో, తమ వాదనను ప్రపంచానికి వినిపించడానికి ఈ పర్యటన ఇరాన్‌కు ఒక అరుదైన అవకాశంగా మారింది.

## కావేరీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు : ప్రైవేటు సంస్థల రిట్ పిటిషన్ కొట్టివేత

కర్ణాటకకు అదనంగా 70 టీఎంసీల నీటిని కేటాయించాలంటూ సుప్రీంలో పిటిషన్

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల్లో థర్డ్ పార్టీల జోక్యాన్ని అంగీకరించబోమన్న సుప్రీంకోర్టు

పోరాడే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని వ్యాఖ్య



తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కావేరీ నదీ జలాల వివాదంలో అత్య న్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అత్య ంత కీలకమైన ఉత్తర్వులను వెలు వరిం చింది. కర్ణాటక రాష్ట్రానికి అదనం గా 70 టీఎంసీల నీటిని కేటా యిం చాలం టూ ఒక ప్రైవేటు సంస్థ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారి ంచిన సర్వోన్నత న్యాయ స్థానం... దానిని తీవ్రంగా పరిగణిస్తూ కొట్టివేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదా ల్లో ఏ విధమైన థర్డ్ పార్టీలు లేదా ప్రైవేటు సొసైటీలు, వ్యక్తులు జోక్యం చేసుకోవడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేసింది. కేవలం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకే మాట్లాడే, పోరాడే హక్కు ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇటువంటి థర్డ్ పార్టీ పిటిషన్లను విచారిస్తూ పోతే వివాదాలు ఎప్పటికీ ముగియవని అభిప్రాయపడింది. తమిళనాడుకు 15 రోజుల పాటు ప్రతిరోజూ 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ నదీజలాల నిర్వహణ అథారిటీ జులై 28న కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు, కర్ణాటకలో కరవు పరిస్థితుల కారణంగా ఈ నీటి విడుదలను వ్యతిరేకిస్తూ అక్కడి రైతులు, కన్నడ సంఘాలు నిరసనలు కొనసాగిస్తున్నాయి. ఇంకోవైపు, ఈ వ్యవహారంలో తమిళనాడుకు చెందిన విజయ్ సర్కార్ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## రాప్తాడులో మంత్రి లోకేశ్‌కు బ్రహ్మరథం.. ఎన్టీఆర్, పరిటాల విగ్రహాల ఆవిష్కరణ

రాప్తాడు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి లోకేశ్

పరిటాల సునీత, శ్రీరామ్ ఆధ్వర్యంలో గజమాలతో ఘన స్వాగతం

భారీ ర్యాలీలో పాల్గొని ప్రజలకు అభివాదం చేసిన లోకేశ్

అనంతరం ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలను ఆవిష్కరణ

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మంత్రి

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో అపూర్వ స్వాగతం లభించింది. నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన ఆయనకు రాప్తాడు కూడలిలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు భారీ గజమాలతో మంత్రి లోకేశ్‌కు ఘనంగా స్వాగతం పలికాయి. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు స్థానిక ప్రజలు తరలివచ్చారు. మంత్రి లోకేశ్ రాక సందర్భంగా పార్టీ శ్రేణులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి, డప్పు వాయిద్యాలతో సంబరాలు జరుపుకున్నారు. రాప్తాడు సర్కిల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు యువనేత నారా లోకేష్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పరిటాల శ్రీరామ్‌తో కలిసి వాహనంపైకి ఎక్కిన లోకేశ్, దారిపొడవునా ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పార్టీ జెండాలు చేతబూనిన కార్యకర్తలు 'జై తెలుగుదేశం' నినాదాలతో రాప్తాడు రహదారులను హోరెత్తించారు. ఈ ర్యాలీ కారణంగా ఆ ప్రాంతమంతా పసుపుమయంగా మారింది. ర్యాలీ అనంతరం మంత్రి లోకేశ్ తొలుత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత రాప్తాడు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు, దివంగత నేత పరిటాల రవీంద్ర విగ్రహాలను ఆవిష్కరించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో రాప్తాడులో పండుగ వాతావరణం నెలకొంది.

## హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం

వాయుగుండం ప్రభావంతో తెలంగాణకు రెండు రోజుల వర్ష సూచన

ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 20 జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక

అధికారులను అప్రమత్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, అంబర్‌పేట, కోఠి, లక్డీకాపూల్ వంటి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా షేక్‌పేట పరిసర ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలోఅ పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం సహా ఎనిమిది జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేయగా, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

దరువు
బుధవారం 23 సెప్టెంబరు 2026

# కొత్తచెరువులో జెడ్పీ ఏర్పాటుకు నిర్ణయం

## ప్రారంభోత్సవానికి సిద్ధవుతున్న మండల పరిషత్ కార్యాలయం

### – గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన అనంత, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యామ్ ప్రసాద్

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి దరువు న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి జిల్లా పరిషత్ కార్యాలయం ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. కొత్తచెరువులోని మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ కార్యాలయంగా ప్రారంభించేలా నిర్ణయం తీసుకున్నారు.

**25 నుంచి కొత్తచెరువు కేంద్రంగా పాలన..**

జిల్లాల పునర్విభజన అనంతరం రాష్ట్రంలో 28 జిల్లాలను ఏర్పాటు చేశారు. 13 జిల్లాల్లో అప్పటికే కొలువై ఉన్న పాలకవర్గం పదవీ కాలం ఈ నెల 24తో ముగుస్తోంది. దీంతో కూటమి ప్రభుత్వం ఏ జిల్లాకు సంబంధించి ఆ జిల్లాలోనే జెడ్పీ పాలనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ప్రస్తుతానికి కొత్తచెరువులోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యామ్ ప్రసాద్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**వడివడిగా ఏర్పాట్లు**

కొత్తచెరువులోని మండల పరిషత్ కార్యాలయాన్ని మరో చోటికి మార్చి, అక్కడ జెడ్పీ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన చర్యలు యుద్ధప్రాదిపదికన జరుగుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో భావనల కొరత తీవ్రంగా ఉండడంతో జెడ్పీకి అనువైన భవనాలను మూడు నెలలుగా పరిశీలిస్తూ వచ్చారు. అయితే కొత్తచెరువులోని మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఖరారు చేసారు. కొత్త జిల్లాల్లో జెడ్పీ పాలన ఈ నెల 25 నుంచి అమలులోకి రావాలని ప్రభుత్వం ఆదేశించడంతో కొత్తచెరువు మండల పరిషత్ కార్యాలయం ఎంపిక చేశారు. ఈ భవన్ సముదాయం కొత్తచెరువు ధర్మవరం – అనంతపురం ప్రధాన రహదారికి అనుకొని ఉండడంతో ఉద్యోగులు, ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని భావించి దీన్ని ఎంపిక చేశారు.




**ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి**


కొత్త జిల్లాల్లో ఏర్పాటు కానున్న జిల్లా పరిషత్ కార్యాలయాలకు అవసరమైన ఉద్యోగులను పాత జెడ్పీ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు ఎవరెక్కడ అనే వివరాలను సేకరించి, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులకు నివేదించి, వారి అనుమతితో పూర్తి చేశారు. జాబితా కూడా అప్పుడే విడుదలైంది. అయితే ఒక రోజు ముందుగా అంటే 24వ తేదీ అందించనున్నట్లు సమాచారం.

# ధర్మవరం అభివృద్ధికి రూ.242.28 కోట్ల పనులు

## హ్యామ్ కింద రూ.43 కోట్లతో రోడ్లు, డివైడర్లు, పార్కులు, వీధి దీపాలు

ధర్మవరం, దరువు న్యూస్: ధర్మవరం పట్టణ సమగ్ర అభివృద్ధికి వివిధ పథకాల కింద రూ.242.28 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి కోసం చేపడుతున్న హ్యామ్ పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి మంగళవారం శ్రీకారం చుట్టగా, మంత్రి అమరావతి నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ధర్మవరం మున్సిపాలిటీకి హ్యామ్ కింద రూ.43 కోట్లతో రోడ్లు, డివైడర్లు, పార్కులు, వీధి దీపాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనులు ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయి. అదేవిధంగా అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకం కింద మరో రూ.43 కోట్లతో 25 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. బీపీఎస్, ఎల్ఆర్ఎస్ నిధులతో రూ.3.90 కోట్లతో 13 పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.4.19 కోట్లతో 17 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మున్సిపల్ సాధారణ నిధులతో రూ.2.23 కోట్లతో 58 అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. తాగునీటి వ్యవస్థ బలోపేతానికి అమృత్ ఫేజ్--1 కింద రూ.17.57 కోట్లు, అమృత్ ఫేజ్--2 కింద రూ.11.18 కోట్లు, అమృత్ 2.0 కింద రూ.31.73 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నారు. వీటిలో ఈఎల్ఎస్ఆర్‌లు, పంప్‌హౌస్‌లు, పైప్‌లైన్లు, రోజుకు 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తదితర పనులు ఉన్నాయి. అమృత్ ఫేజ్--1, ఫేజ్--2 పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఎస్‌బీఎం 2.0 కింద ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు రూ.21.68 కోట్ల పనులు పురోగతిలో ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రూ.5.20 కోట్ల రోడ్లు, డ్రైన్లు, పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. తాగునీటి పైప్‌లైన్ కోసం రూ.2.54 కోట్ల పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. సద్భావన భవనానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అదేవిధంగా యూఐడీఎఫ్--4 కింద రూ.72 కోట్లు, యూసీఎఫ్ ఫేజ్--2 కింద డ్రైనేజీ పనులకు రూ.23 కోట్ల విలువైన పనులు పరిపాలనా అనుమతుల దశలో ఉన్నాయని మంత్రి వివరించారు. ప్రగతి నివేదిక ప్రకారం ప్రస్తుతం ధర్మవరం పట్టణంలో రూ.104.28 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని, టెండర్ మరియు పరిపాలనా అనుమతుల దశలో ఉన్న పనులతో కలిపి పట్టణ అభివృద్ధికి రూ.242.28 కోట్ల సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ధర్మవరం పట్టణ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కులు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు అందించడమే లక్ష్యమని, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.





# పుట్టపర్తిలో మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం

పుట్టపర్తి/కొత్తచెరువు, దరువు న్యూస్: రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు పుట్టపర్తి శ్రీ సత్యసాయి విమానాశ్రయంలో మంగళవారం ఘన స్వాగతం లభించింది. పుట్టపర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి నేతృత్వంలో తెలుగుదేశం, కూటమి పార్టీల శ్రేణులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికాయి. ఉదయం 8:45 గంటలకు ప్రత్యేక విమానంలో విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుష్పగుచ్చాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు ఎం.ఎస్. రాజు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణి శ్రీ, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, టీడీపీ సీనియర్ నేతలు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు తదితర ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నేతలు పాల్గొన్నారు. మంత్రి లోకేష్ రాక సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ, కూటమి కార్యకర్తలు, అభిమానులు విమానాశ్రయానికి తరలివచ్చారు. కార్యకర్తల నినాదాలతో విమానాశ్రయ పరిసర ప్రాంతాలు హోరెత్తాయి. పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. అనంతరం మంత్రి పలువురు నాయకులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు.



# అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవా పథకం వర్తింపజేయాలి

ధర్మవరం, దరువు: శ్రీ సత్యసాయి జిల్లాలో అర్హులైన చేనేత కార్మికులందరికీ నేతన్న సేవా పథకం వర్తింపజేయాలని కోరుతూ ఏపీ చేనేత ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పీఏ హరీష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకటనారాయణ, జిల్లా కన్వీనర్ జె.వి. రమణ, ఎస్. హెచ్. భాష మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవా పథకం కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందించాల్సి ఉండగా పలువురికి పథకం వర్తించలేదన్నారు. అర్హులైన సుమారు 33,600 మంది కార్మికులను గుర్తించినప్పటికీ, వారికి నగదు జమ చేసే విషయంలో ఇచ్చిన హామీ అమలు కాలేదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై మంత్రి పీఏ హరీష్ స్పందిస్తూ ఈ నెలాఖరులోపు అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి రూ.25 వేల సాయం అందేలా మంత్రి దృష్టికి తీసుకెళ్తామని, అర్హులకు పెన్షన్ సౌకర్యం కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు గుర్రం వెంకటస్వామి, ఏ. ఖాదర్‌బాషా, గుంపు హరి, విజయభాస్కర్, గంగప్ప, హసన్‌వలి, రాజా, శివనాగేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# ధర్మవరంలో నిజాయితీకి పోలీసుల సత్కారం

ధర్మవరం, దరువు న్యూస్: దొరికిన మూడు తులాల బంగారు నెక్లెస్‌ను ఆశపడకుండా పోలీసులకు అప్పగించిన ముగ్గురిని ధర్మవరం టూ టౌన్ సీఐ జయ నాయక్ సత్కరించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 17న కళ్యాణదుర్గం నుంచి ప్రైవేట్ బస్సులో ధర్మవరం వచ్చిన రాజేశ్వరి బస్సు దిగే సమయంలో మూడు తులాల బంగారు నెక్లెస్‌ను పోగొట్టుకున్నారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నెక్లెస్ దొరికిన కుమ్మర రామాంజనేయులు, ఆటో డ్రైవర్ నరసింహులు, కంబదూరు మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన సిద్ధమ్మలు దానిని ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఇషాక్ భాషాకు అప్పగించారు. పోలీసులు నెక్లెస్‌ను రాజేశ్వరికి తిరిగి అందజేశారు. నిజాయితీగా వ్యవహరించిన రామాంజనేయులు, నరసింహులు, సిద్ధమ్మలను సీఐ జయ నాయక్ శాలువాలతో సత్కరించి, ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున నగదు పారితోషికం అందజేశారు. దొరికిన విలువైన వస్తువులను పోలీసులకు అప్పగించడం నిజాయితీకి నిదర్శనమని సీఐ పేర్కొన్నారు. ప్రజలు కూడా ఇలాంటి వస్తువులు దొరికినప్పుడు సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు.



# లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలి: సీఐటీయూ

పుట్టపర్తి/కొత్తచెరువు, దరువు న్యూస్: కార్మికుల హక్కులను హరించే నూతన లేబర్ కోడ్‌లను కార్మికులంతా ఐక్యంగా తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు పిలుపునిచ్చారు. పుట్టపర్తిలోని కార్మిక కర్షక భవన్‌లో శ్రీ సత్యసాయి వాటర్ వర్కర్స్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు నిర్వహించారు. మధుసూదన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓబులు సీఐటీయూ జెండాను ఆవిష్కరించి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, సంక్షేమ చట్టాలను పరిరక్షించుకోవడానికి సంఘటితంగా ఉద్యమించాలన్నారు. కార్మికులు తమ హక్కులు, చట్టాలు, ప్రభుత్వ విధానాలపై శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలని సూచించారు. 'శాస్త్రీయ అవగాహన' అంశంపై సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, 'లేబర్ కోడ్‌లు--కార్మికులకు నష్టం' అంశంపై జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్. నరసింహులు ప్రసంగించారు. లేబర్ కోడ్‌లతో ఉద్యోగ భద్రత, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్, వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు మధు, నరేష్, ప్రభు, వెంకటేశ్, రాజారెడ్డి తదితరులతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.




# ఘనంగా పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు వేడుకలు







ధర్మవరం, దరువు న్యూస్: ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. గ్రామాలు, వార్డుల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. పుట్టినరోజు సందర్భంగా ధర్మవరం పట్టణ టీడీపీ నాయకులు దుర్గమ్మ దేవాలయంలో పరిటాల శ్రీరామ్ పేరిట ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్న క్యాంటీన్ వద్ద పేదలకు ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఇదిలా ఉండగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాప్తాడులో పలు కార్యక్రమాలకు హాజరుకానున్న నేపథ్యంలో ధర్మవరం నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రాప్తాడుకు తరలివెళ్లారు.

# ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన కేఎఫ్‌డబ్ల్యూ జర్మనీ బృందం

చిలమత్తూరు, దరువు న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం పటాచామర్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం అమలు తీరును తెలుసుకునేందుకు కేఎఫ్‌డబ్ల్యూ (జర్మనీ బ్యాంకు) పరిశోధన భాగస్వాముల బృందం మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించింది. రైతుల అనుభవాలు, కాంపాక్ట్ బ్లాక్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) కార్యకలాపాలు, కేడర్ల పాత్రను బృందం పరిశీలించింది. కేఎఫ్‌డబ్ల్యూ సెక్టార్ ఎకనామిస్ట్ ఐరిస్ హార్డర్, న్యూఢిల్లీ సీనియర్ స్పెషలిస్ట్ సంగీత అగర్వాల్‌తో పాటు రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ (రిటైర్డ్ ఐఏఎస్), అడ్వైజర్ జి. మురళీధర్, చీఫ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ అధికారి లక్ష్మానాయక్, సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ డా. నవీన్ తదితరులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం అమలు, రైతుల భాగస్వామ్యం, కేడర్ల కార్యకలాపాలు, కాంపాక్ట్ బ్లాక్‌ల అభివృద్ధిపై బృందానికి అధికారులు వివరించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడిన కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులు సంప్రదాయ వ్యవసాయం నుంచి ప్రకృతి వ్యవసాయానికి మారిన విధానం, ఎదురైన అనుభవాలు, సాగు తర్వాత వచ్చిన మార్పులను తెలుసుకున్నారు. అనంతరం రైతు కృష్ణారెడ్డికి చెందిన 0.50 ఎకరాల మల్బరీ ఏ-గ్రేడ్ మోడల్ను సందర్శించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పంట నిర్వహణ, మోడల్ అమలు విధానంపై రైతుతో చర్చించారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా ప్రకృతి వ్యవసాయం వల్ల రైతుల్లో చోటుచేసుకుంటున్న మార్పులను బృందం తెలుసుకుంది.





# జర్నలిస్టుల కోసం పుట్టపర్తిలో ఉచిత మెగా వైద్య శిబిరం

## సెప్టెంబర్ 26న సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో నిర్వహణ

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి దరువు న్యూస్: జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ కోసం సెప్టెంబర్ 26న పుట్టపర్తిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో ఉదయం నుంచి జరిగే శిబిరంలో బెంగళూరుకు చెందిన వైదేహి ఆసుపత్రి, తిరుపతిలోని స్విమ్స్, బసవతారకం ఇండో - అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రముఖ స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. శిబిరంలో ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్, మామోగ్రఫీతో పాటు వివిధ స్పెషాలిటీ వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అవసరమైన వారికి తదుపరి చికిత్సపై వైద్య నిపుణులు సూచనలు, సలహాలు అందించనున్నారు. వృత్తిపరమైన ఒత్తిడి కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులందరూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



రాయలసీమ దరువు APTEL/26/A7874 తెలుగు దినపత్రిక

బుధవారం 23 సెప్టెంబరు 2026

## ప్రాణాలను కాపాడటమే మహోన్నతమైన సేవ

- ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు భాస్కర్ బాబు



**అనంతపురం, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా అనంతపురం పాత ఊరులోని శ్రీ విశ్వకర్మ కళ్యాణ మండపంలో సవేరా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వీబీ భాస్కర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను చూసి భయపడకుండా, వ్యాధిని సకాలంలో గుర్తించి, సరైన వైద్యం పొందడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్సపై అవగాహన కల్పించారు. ప్రజల ఆరోగ్యం కోసం ఒక అడుగు ముందుకు వేస్తే అది ఒక కుటుంబానికి భరోసాగా, ఒక ప్రాణానికి ఆశగా నిలుస్తుందని నిర్వాహకులు భాస్కర్ బాబు పేర్కొన్నారు. 'ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆరోగ్య పరిరక్షణే మనందరి బాధ్యత' అని ఆయన అన్నారు. కార్యక్రమంలో సవేరా హాస్పిటల్ వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం చేసింది, చేయబోయేది.. టీడీపీనే

- వడ్డెర్లను గుర్తించిన ఏకైక పార్టీ టీడీపీ.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- వడ్డెర్ల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ద్వారా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..
- అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్





**అనంతపురం, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

బీసీలకు గతంలో న్యాయం చేసింది.. రేపు న్యాయం చేసేది తెలుగు దేశం పార్టీ మాత్రమేనని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్సీ దళ వాయి రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన వడ్డెర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర్లకు ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజే శారు. అలాగే ఇటీవల ఎమ్మెల్సీగా నియమితులైన రమాదేవిని ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన గెలుపులో వడ్డెర్ల పాత్ర కూడా ఎంతో ఉందన్నారు. ఆ రోజు అనంతపురంకి కొత్తగా వచ్చిన తనను ఆదరించిన వారిలో వడ్డెర్లు కూడా ఉన్నారన్నారు. వడ్డెర సమాజానికి మన రాష్ట్ర అభివృద్ధిలో ఎంతో గొప్ప పాత్ర ఉందని, రోడ్లు, భవనాలు, చెరువులు, కాలువలు, రాయి పనులు, నిర్మాణ రంగం-ఇలా ఎన్నో రంగాల్లో వడ్డెర సోదరులు తమ శ్రమతో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం వడ్డెర్ల సంప్రదాయ వృత్తిని గుర్తించి, వారికి ఆర్థికంగా ఎదగడానికి అవకాశాలు కల్పించే దిశగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. క్వారీ రంగంలో వడ్డెర్లకు తీసుకొచ్చిన 33శాతం ప్రత్యేక కేటాయింపు ద్వారా వారి సంప్రదాయ వృత్తికి ఒక కొత్త ఆర్థిక బలం కల్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. అదేవిధంగా ఆదరణ-3 ద్వారా ఆధునిక పనిముట్లు, యంత్రాలు అందించడం, బీసీ యువతను స్వయం ఉపాధి, ఎంఎస్ఎంఈ రంగాల వైపు తీసుకెళ్లే చర్యలు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వడ్డెర్ల పిల్లలు ఉన్నత విద్య చదవాలని, ఇంజనీర్లు, డాక్టర్లు, ప్రభుత్వ అధికా రులు, వ్యాపారవేత్తలు కావాలన్నారు. వడ్డెర సమాజం కూడా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా మరింత బలపడాలన్నారు. అందుకే ఎన్నికలలో వడ్డెర కులానికి ఇచ్చిన మాట ప్రకారం వడ్డెర ఆడబిడ్డకు ఎమ్మెల్సీ పదవి కేటాయించారన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తోందని, ఇది బీసీల పట్ల సీఎం చంద్రబాబుకి, మంత్రి నారా లోకేష్‌కి, టీడీపీకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## 27న చెకుముకి సైన్స్ సంబరాలు

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.చిత్తప్ప, కె.వీరరాజులు వెల్లడి



**అనంతపురం, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఈనెల 27న ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కాలేజి డ్రామా హాల్ నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కె.చిత్తప్ప, కె.వీరరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మాజీ ఎమ్మెల్సీ జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అయూబ్ హుస్సేన్, వక్తలుగా విశ్రాంత అధ్యాపకులు జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి హాజరవుతారన్నారు. జిల్లాలోని 28 మండలాల నుండి 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సంబంధించిన 56 జట్లు పాల్గొంటాయని వారు తెలియజేశారు. వీరంతా ఆగస్టు 27న పాఠశాల స్థాయిలోను, సెప్టెంబర్ 11న మండల స్థాయిలో జరిగిన సైన్స్ సంబరాల్లో మొదటి స్థానంలో ఎంపికైన వారని వారు పేర్కొన్నారు. 27న, కార్యక్రమంలో పాల్గొనాలని మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారిని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకె భాస్కర్, నగర అధ్యక్ష కార్యదర్శులు కె.ప్రసాద్‌రెడ్డి, ఎస్.తిరుపాల్, నాయకులు నానీల నాగేంద్ర, హుస్సేన్ సాహెబ్‌లు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

- ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాక్ బుక్‌లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవీఎం గోడౌన్ల వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని, ఏ ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ ప్రతినిధి మసూద్ వలి, కాంగ్రెస్ ప్రతినిధి ఇమామ్, సిపిఐ(ఎం) ప్రతినిధి రామాంజనేయులు, బిజెపి శ్యామ్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల రాక

- 23, 24వ తేదీలలో ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు జిల్లా పర్యటన
- జిల్లాలో పర్యటించనున్న ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

ఈనెల 23, 24వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (అప్సీపీసీర్ ) సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు జిల్లా పర్యటనకు రానున్నారని తెలిపారు. ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఐసిడిఎస్ కేంద్రాలు, కేజీబీవీలు, సిసిఐలను తనిఖీలు చేస్తారు. మధ్యాహ్నం 01:30 గంటల నుంచి 02:00 గంటల వరకు ఎన్జీవోలతో ఇంటరాక్ట్ అవుతారు. మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్లను తనిఖీ చేస్తారు మరియు ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రికి వారు జిల్లాలో బస చేస్తారు. ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు అనంతపురం కలెక్టరేట్‌లో ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, జువైనల్ జస్టిస్ బోర్డ్, ఫుడ్ సేఫ్టీ, డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఓ, డిఐఈఓ, పిడి ఎస్ఎస్ఏ, రెవెన్యూ శాఖ, పిడిఆర్డీ, ఎంఎయుడి, విద్యాశాఖ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, లేబర్, విలేజ్ / వార్డు చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్‌డ మైనార్టీ కమిటీ, పోలీస్, ఆర్టీవో రూరల్, వాటర్ సప్లై, మున్సిపల్, పంచాయతీరాజ్, తదితర శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం 05:30 గంటలకు అనంతపురం జిల్లా నుంచి బయలుదేరి అన్నమయ్య జిల్లాకు వెళతారు.

## నూతన విద్యార్థులకు స్వాగతం

- ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి కుమార్



**మడకశిర, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

ఉన్నత విద్య కమీషనర్ వారి ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థిని, విద్యార్థులకు స్వాగత కార్యక్రమంనకు శ్రీకారం చుట్టినట్లు మడకశిర ఎస్వైటీఆర్ ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. మంగళవారం అయన మాట్లాడుతూ.. దీనిలో భాగంగానే మడకశిరలో విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహిం చడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి అయన ప్రసం గించారు. ఈ కార్యక్రమం 7 రోజులు పాటు వివిధ అంశాలపైన నూతన విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అధ్యాపకుల పరిచయం, కళాశాల పరిచయం, నైతికవిలువలు, వ్యక్తిత్వ వికాసం, సమాజం పట్ల అవగాహన వంటి అంశాలను భోదిస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమలత, అధ్యాపకులు అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సుబ్బారాయుడు, అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులను పలకరించిన మంత్రి నారా లోకేష్

### మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా..



**ధర్మవరం, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

రాప్తాడు పర్యటన ముగించుకుని పుట్టపర్తి విమానాశ్రయానికి వెళ్తున్న మంత్రి నారా లోకేష్ ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద తన కాన్వాయ్‌ను నిలిపారు. పాఠశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులను చూసిన మంత్రి లోకేష్‌ని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడిన మంత్రి.. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యా బోధన తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని అధికారులను మంత్రి సూచించారు. మంత్రి అకస్మాత్తుగా పాఠశాల వద్ద ఆగి తమతో మాట్లాడటంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## పుట్టపర్తి విమానాశ్రయంలో మంత్రి లోకేష్‌కి స్వాగతం

స్వాగతం పలికిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**కదిరి, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కి కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నారా లోకేష్ ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, నియోజకవర్గాల వారీగా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు.

## వాస్తవాలు మాట్లాడితే మాజీ ఎమ్మెల్యే, మాజీ మేయర్‌కు..

# రోషం పొడుచుకొస్తోంది

- గత ఇదేళ్లలో డంపింగ్ యార్డ్, వంకర టింకర రోడ్లతో కోట్లు కాజేశారు
- వైసీపీ నేతలపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం
- హైబ్రిడ్ యాన్యుటి మోడల్ (హెచ్ఏఎం) పథకం ద్వారా 50కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- జగన్ రెడ్డి నగరపాలక సంస్థల నిధులను పక్కదారి పట్టించాడన్న దగ్గుపాటి
- ఉపాధ్యాయులపై దాడులు చేసిన వైసీపీ గూండాలు మూల్యం చెల్లించుకుంటారన్న ఎమ్మెల్యే



**అనంతపురం, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

వాస్తవాలు మాట్లాడితే మాజీ ఎమ్మెల్యే, మాజీ మేయర్‌కు రోషం పొడుచుకొస్తోందని అనంత పురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైబ్రిడ్ యాన్యుటి మోడల్ (హెచ్ఏఎం) పథకం ద్వారా అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో 50కోట్ల అభివృద్ధి పనులకు జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మోడల్‌లో తొలిసారిగా రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబు రూ.11,359 కోట్ల పనులను వర్చువల్ ప్రారంభించారు. 26 జిల్లాల్లో 106 నియోజకవర్గాల్లోని.. 123 మున్సిపాలిటీల్లో పనులు ఒకేసారి ప్రారంభించారు. ఇందులో భాగంగా అనంతపురం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. 50కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 1300కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతపురం నగరంలో ఓల్డ్ టౌన్ సహా అన్ని ప్రాంతాలకు ప్రతి రోజు తాగునీరు అందించడంతోపాటు మురుగునీరు శుద్ధి చేసే విధంగా భారీ శుద్ధి కేంద్రాన్ని రూ.107.71 కోట్లతో ప్రారంభించామన్నారు. ఇప్పుడు తాజాగా విడుదల చేసిన 50కోట్ల రూపాయలతో రోడ్లు, పార్కులు, డివైడర్లు, వీధి లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో 160కోట్ల రూపాయలతో డ్రైనేజీల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. గత ఐదేళ్లలో ఒక్క రోజు కూడా ఇలాంటి పనులు చేయ లేదన్నారు. పైగా గతంలో నగరపాలక సంస్థకు వచ్చే డబ్బును కూడా దారి మళ్లించారన్నారు. మళ్లీ ఆ నిధులు కోసం అడుక్కో వాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇలా ప్రతి ఏటా వంద కోట్ల రూపా యలు నగరపాలక సంస్థ నుంచి పోయేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చాక.. స్థానిక సంస్థల నుంచే వచ్చే ఆదాయాన్ని అక్కడే వినియోగించుకునేలా జీఓ ఇచ్చారన్నారు. 62డివిజన్లలోనూ ప్రస్తుతం మేము చేసిన అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయన్నారు. అయితే ఇలాంటి వాస్తవాలు చెబితే మాజీ ఎమ్మెల్యే, మాజీ మేయర్ కు రోషం పొడుచుకొస్తోందన్నారు. డంపింగ్ యార్డ్, వంకర టింకర రోడ్లతో కోట్లు కొల్లగొట్టారన్నారు. చేతనైతే మీరు చేసిన వాటి గురించి చెప్పుకోవాలన్నారు. వారు ఇలాగే మాట్లాడితే మా కార్యకర్తలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మేము 62 డివిజన్లు, 4పంచాయతీల్లో క్లీన్ స్వీప్ చేస్తామన్నారు. మరోవైపు మెగా డీఎస్సీ ద్వారా ఎలాంటి వివాదాలకు తావులేకుండా 16347ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తే.. వైసీపీ నాయకులు దానిపై విషం చిమ్ముతున్నారన్నారు. పైగా విజయవాడలో శాప్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు ఉపాధ్యాయులపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి, తండ్రి తర్వాత మన దేవుళ్లుగా పూజించే ఉపాధ్యాయులను దూషిస్తూ.. కోడిగుడ్లతో దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడి చేసిన వైసీపీ గూండాలు తగిన మూల్యం చెల్లించు కుంటారన్నారు. వైసీపీ వారికి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో ఆ 11స్థానాలు కూడా మిగలవని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు రాజారావు, తొండపునాటి రమేష్, చేపలహరి, సాకే లక్ష్మీ నరసింహ, పొట్లూరి కేశవ నాయుడు, గోపాల్ గౌడ్, ఇస్మాయిల్, నెట్టెం బాలకృష్ణ, కాయగూరల శ్రీధర్, మోహన్ కుమార్, డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేష్, కొండన్న, దాసరి చంద్రకళ, ప్రశాంతి, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

## గురువులపై దాడిచేసిన గొడ్డలిపార్టీ రౌడీ బ్యాచ్ ఎక్కడున్నా వదలం!

రాప్తాడు నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్



**అనంతపురం, సెప్టెంబర్ 22, దరువు న్యూస్ :**

నిన్న శాప్ కార్యాలయం వద్ద విద్యనేర్పే గురువులపై గొడ్డలిపార్టీ రౌడీమూకలు విచక్షణా రహితంగా గుడ్లతో దాడిచేశారు. ఈ దాడిలో పాల్గొన్న రౌడీ బ్యాచ్ లో ఏ ఒక్కరినీ వదలిపెట్టం. ఎపిలోనే కాదు, అండమాన్ లో ఉన్నా, ఆస్ట్రేలియా వెళ్లినా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ స్పష్టం చేశారు. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మాట్లాడుతూ.. జగన్ టెన్త్ క్లాస్ తప్పాడు. అందువల్లే టీచర్లపై కక్ష పెంచుకున్నాడు. నిన్న ఉపాధ్యాయులపై రౌడీమూకలను ఉసిగొల్పాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మేం భయపడలేదు, ఇప్పుడు భయపడతామా? నీతి, నిజాయితీగా బతికిన కుటుంబం మాది. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53రోజులు జైలులో పెట్టారు, ఒక్కటైనా నిరూపించ గలిగారా? ఆయనపై పెట్టిన ఒక్క కేసుకూడా నిలబడలేదు. నాపై కోపం ఉంటే నేరుగా రా.. టైమ్, డేట్ ఫిక్స్ చెయ్యి, తేల్చుకుందాం. కల్తీ మద్యం, ఎపిపిఎస్సీపై కూడా చర్చిద్దాం. నాపై కోపం ఉంటే నాతో తేల్చుకో. అంతేగానీ ఉపాధ్యాయుల జోలికొస్తే సహించేది లేదని లోకేష్ హెచ్చరించారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం గెలవాలి

గత సార్వత్రిక ఎన్నికల్లో 94శాతం సీట్లతో ఘనవిజయం సాధించాం. రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో నూటికి నూరుశాతం గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలదే. వచ్చేనెలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కేడర్ సిద్ధంకావాలి. రెండున్నరేళ్ల తర్వాత ప్రజల వద్దకు వెళ్తున్నాం. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలపై ప్రజల్లో చైతన్యం తేవాలి. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమైంది. చిన్నచిన్న విభేదాలను పక్కనపట్టి ముందుకెళదాం. విజయం కోసం కలసికట్టుగా ముందుకు సాగుదాం. అన్నిస్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలిపించేందుకు కార్యకర్తలంతా కార్యోన్ముఖులు కావాలి. ఢిల్లీనుంచి గల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యం. రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం ఉండటం వల్ల మనం కోరిన అన్ని కోర్కెలు ప్రధాని తీరుస్తున్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కలసికట్టుగా ముందుకెళ్లాలి. నోక్రాస్ ఫైర్, నో మిస్ ఫైర్, నో విడాకులు. మనది ఒక పెద్ద కుటుంబం. కుటుంబం అన్నాక సమస్యలు ఉంటాయి. కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుందాం.

### పరిటాల కుటుంబంతో దశాబ్దాల అనుబంధం

పరిటాల కుటుంబంతో మా కుటుంబ అనుబంధం దశాబ్దాల నాటిది. అన్యాయం జరిగిన చోట ఎదురొడ్డి నిలబడాలన్నది ఇరు కుటుంబాల ధ్యేయం. మహిళల జోలికొస్తే తోలు తీయాలన్న లక్ష్యంతో పనిచేశాం. భూస్వాములతో పోరాడి నిరుపేదలకు భూమి పంచారు పరిటాల శ్రీరాములయ్య. ఫ్యాక్షన్ కు ఫుల్ స్టాప్ పెట్టారు పరిటాల రవీంద్ర. తనకు ప్రమాదం ఉందని తెలిసినా కార్యకర్తలను వెంటాడి చంపితే అండగా వెళ్లి, ప్రాణాలను కోల్పోయారు. కాంగ్రెస్, వైసిపిల హయాంలో ఉమ్మడి అనంతపురంలో 164మంది కార్యకర్తలను కోల్పోయాం. చంద్రబాబు గారు కార్యకర్తలు ఫ్యాక్షన్ వైపు వెళ్లకుండా ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూలు ఏర్పాటుచేశారు. ప్రతివారం ఎన్టీఆర్ మోడల్ స్కూలుకు వెళ్లి పిల్లల్లో ధైర్యం నింపారు. వారిని ప్రయోజకులను చేసిన ఘనత చంద్రబాబుది. ఈ సమావేశంలో మంత్రి ఎస్.సవిత, హిందూపూర్ ఎంపి బికె పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్చార్జి పరిటాల శ్రీరాం, హిందూపురం పార్లమెంటు పార్టీ ప్రెసిడెంట్ ఎంఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి హనుమప్ప, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి, జిల్లాపార్టీ ఎన్నికల పరిశీలకులు ఏరాసు ప్రతాపరెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాప్తాడు నియోజకవర్గ అబ్జర్వర్ పద్మలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.